చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

ప్రజాశక్తి - భీమవరం

ట్రాఫిక్‌కు అంతరాయంపేరుతో తొలగిస్తున్న చిరువ్యాపారులకు ప్రభుత్వం ప్రత్యామ్నాయం చూపాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ డిమాండ్ చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం పేరుతో జిల్లాలో అనేకచోట్ల తోపుడు బండ్లపై చిరువ్యాపారం చేసుకునే వ్యాపారులను, రోడ్డు పక్కన ఉన్న షాపులను అధికారులు వారికి ప్రత్యామ్నాయం చూపకుండా తొలగిస్తూ నిరాశ్రయుల్ని చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో అనేక ప్రాంతాల్లో వందలాది మంది చిరువ్యాపారులు పూలు, పండ్లు, టిఫిన్లు, మాంసం, చేపలు, ఇతర నిత్యావసర వస్తువులను తోపుడు బండ్లపై అమ్ముకుంటూ స్వయం ఉపాధి పొందుతున్నారన్నారు. ఎవరినైతే తొలగించాలనుకుంటున్నారో వారికి ప్రత్యామ్నాయం చూపించిన తర్వాతే ఈ చర్య చేపట్టాలని కోరారు.

ప్రజల మనోభావాలకు అనుగుణంగా పాలన

మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

ప్రజల మనోభావాలకు అనుగుణంగా పాలన అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. శనివారం పాలకొల్లు రూరల్‌లో డాక్టరు బిఆర్.అంబేద్కర్ భవనాన్ని, పెదగరువులో అంబేద్కర్ కళ్యాణ మండపాన్ని ఆయన ప్రారంభించారు. రామయ్యహాలు గృహాల వద్ద అధికారులతో మంత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పాలకొల్లు పట్టణంలో డాక్టరు బిఆర్.అంబేద్కర్ భవనం ఏర్పాటు 30 సంవత్సరాల కల అని అన్నారు. తాను చదువుకున్న రోజుల్లో సైకిల్ మీద స్కూలుకు వెళ్లేటప్పుడు పిల్లర్స్ మాత్రం ఉండేవని గుర్తు చేశారు. తాను తొలిసారి 2014లో ఎంఎల్ఎగా గెలుపొందిన తర్వాత టిడిపి ప్రభుత్వంలో రూ 2.50 కోట్లతో అంబేద్కర్ భవనాన్ని సుందరవనంగా నిర్మిస్తే, గత ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో రూపాయి ఖర్చు పెట్టలేదన్నారు. కనీసం రంగులు కూడా వేయలేకపోయారన్నారు. మిగిలిన పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. పెదగరువులో దొడ్డా సూర్యచంద్రరావు, సత్యవతి పేరుమీద మండపం నిర్మాణం చేయడంపై వారి కుటుంబ సభ్యులను మంత్రి రామానాయుడు అభినందించారు. శ్మశాన వాటిక రహదారి నిర్మాణానికి రూ.18 లక్షలు మంజూరు చేస్తున్నానని, గ్రామాన్ని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతామని అన్నారు. ఈ కాలనీలో రక్షిత మంచినీరు వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్‌రావు, ఆర్‌డిఒ దాసి రాజు, మున్సిపల్ కమిషనర్ బి.విజయసారథి, తహశీల్దారు వై.దుర్గాకిషోర్, గండేటి వెంకటేశ్వరరావు, పెచ్చెట్టి బాబు, ఉన్నమట్ల కబర్ధి, బోణం చినబాబు, పాముల రజినీకుమార్, పెనుమత్స రామభద్రరాజు, మామిడిశెట్టి పెద్దిరాజు, బిరుదుకోట సోమశేఖర్, చినమిల్లి గణపతిరావు, ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు

స్వచ్ఛాంధ్ర సాధనలో భాగస్వాములు కావాలి

కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

స్వచ్ఛాంధ్ర లక్ష్యసాధనలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. జిల్లాలో ఎక్కడా రోడ్లపై చెత్త వేయకూడదని, ప్లాస్టిక్ వస్తువులను వినియోగించకూడదని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. స్థానిక కలెక్టరేట్ నుండి కలెక్టర్ నాగరాణి, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి స్వచ్ఛ ఆంధ్ర లక్ష్య సాధనలో భాగంగా తీసుకోవాల్సిన చర్యలపై జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, మార్కెటింగ్ శాఖ ఎడితో గూగుల్ మీట్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఆలయాల వద్ద పువ్వులు, పళ్లు, ఇతర వ్యర్థ పదార్థాల వంటి వేస్ట్ ఎక్కువగా ఉంటుందని, దానిని రీసైక్లింగ్ చేసుకునే విధంగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. కూరగాయ మార్కెట్లు, హోటల్స్, షాపింగ్ కాంప్లెక్స్‌లు, రెసిడెన్సీలు హాస్పిటల్స్ వద్ద వచ్చే వ్యర్థ పదార్థాలను స్థానికంగానే కంపోస్ట్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ నెల 15న ముఖ్యమంత్రి తణుకు పట్టణంలో పర్యటించినప్పుడు ఐక్యనగర్‌లోని హౌసింగ్ కాలనీలో ఉన్న పార్కును రూ.30 లక్షల వ్యయంతో అభివృద్ధి చేసేందుకు దేవి సీఫుడ్స్ లిమిటెడ్ ముందుకొచ్చిందన్నారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ మొగిలి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

మద్యం దుకాణం ఏర్పాటుపై అభ్యంతరాల పరిశీలన

ప్రజాశక్తి - తణుకు రూరల్

తణుకు మండలం తేతలిలో మద్యం దుకాణం ఏర్పాటును నిలిపేయాలని వచ్చిన ఫిర్యాదు మేరకు తణుకు ఎక్సైజ్ పోలీసులు, పంచాయతీ సిబ్బంది స్థలాన్ని శనివారం పరిశీలించారు. గీత కార్మిక సామాజిక తరగతులకు రిజర్వు చేసిన మద్యం దుకాణం లక్కీ డ్రాలో పెన్మెట్స నాగేశ్వరరావు లైసెన్స్ దక్కింది. దుకాణం ఏర్పాటు నిమిత్తం తేతలి శివారులో స్థలాన్ని పరిశీలించి షెడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ ప్రాంతానికి సమీపంలో సీతారామ వారి దేవస్థానం ఉన్నందున మద్యం దుకాణం ఏర్పాటు ఆపాలని కోరుతూ ఆ ఆలయ ధర్మకర్త తేతలి సీతారామ సుబ్రమణ్యం పంచాయితీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై తణుకు ఎక్సైజ్ పోలీసులు, పంచాయతీ సిబ్బంది కొలతలు వేశారు. గుడి ద్వారం నుంచి మద్యం దుకాణం ఏర్పాటు చేయబోయే గేటు వరకు 125 మీటర్లు దూరం ఉందని తణుకు ఎక్సైజ్ సిఐ ఎస్.మణికంఠరెడ్డి తెలిపారు. గుడి, బడికి వంద మీటర్ల దూరం తర్వాత దుకాణం ఏర్పాటు చేసుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో తణుకు ఎక్సైజ్ ఎస్ఐ మధుబాబు, సిబ్బంది కడలి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు టిఎ.రామకృష్ణ, మానుకొండ డాక్టర్ బాబు, పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న అధికారులు

మద్యం దుకాణం వద్దని ఆందోళన

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని 26వ వార్డులో వీవర్స్ కాలనీ వద్ద నివాసాల మధ్య మద్యం దుకాణం వద్దంటూ శుక్రవారం కాలనీవాసులు ఆందోళన చేపట్టారు. ఈ ప్రాంతంలో ఇప్పటికే విచ్చలవిడిగా మద్యం తాగుతున్నారని, దుకాణం ఏర్పాటుతో పరిస్థితి మరింత దిగజారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దుకాణాన్ని వేరే ప్రాంతానికి తరలించాలని కాలనీవాసులు కోరారు. కొత్తగా దుకాణం పెట్టబోమని దుకాణ నిర్వాహకులు చెప్పడంతో ఆందోళన విరమించారు. అనంతరం వారంతా సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్‌డిఒ దాసి రాజు, ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్‌ను వేర్వేరుగా కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ నివాస గృహాలతోపాటు బాలికల గురుకుల పాఠశాల కూడా ఈ ప్రాంతంలోనే ఉందన్నారు. మద్యం దుకాణాన్ని వేరే ప్రాంతానికి తరలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యర్రా శ్రీను, ఘంటా కృష్ణ, మావూరి ఆనంద్ కుమార్, కాసాని బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



ఎంఎల్ఎకు వినతి అందిస్తున్న కాలనీవాసులు

ఉపాధి హామీకి నిధులు పెంచాలి

ఎపి వ్యకాస జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ

ప్రజాశక్తి - కాళ్ల

గ్రామాల్లో కూలీలకు ఉపాధి హామీ పనులు చూపాలని, దీనికి కేంద్రం తగినన్ని నిధులు కేటాయించి పటిష్టంగా చట్టాన్ని అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, సిఐటియు కాళ్ల మండల అధ్యక్షులు గొర్ల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పెదఅమిరంలో చెరువు పని చేస్తున్న కూలీలను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు చేసిన కూలీలకు వేతనాలు ఇవ్వడంలో పాలక ప్రభుత్వాలు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. పని ప్రదేశంలో కనీస వసతులు కల్పించకపోవడం వల్ల ఉపాధి కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పని ప్రదేశంలో టెంట్లు, మెడికల్ కిట్లు ఏర్పాటు చేయాలన్నారు. కష్టపడి పని చేస్తున్న కూలీల పట్ల ఇంజినీరింగ్ అధికారులు కూలీల పట్ల దురుసుగా మాట్లాడటం సరికాదన్నారు. ఇప్పటికైనా బడ్జెట్లో ఉపాధి హామీకి నిధులు పెంచి పని దినాలు, వేతనం పెంచాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాటుక సత్యవతి, మండా అవ్వమ్మ, కోరుకొండ అరుణ, బిరుదు గడ్డ మార్తమ్మ, యిర్రింకి చిన్న గంగయ్య, బిరుదుగడ్డ పెద్దిరాజు, కాటుక విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జక్కంశెట్టి సత్యనారాయణ

ఏరులై పారుతున్న అక్రమ మద్యం

విచ్చలవిడిగా బెల్టుషాపుల నిర్వహణ

కల్లుగీత వృత్తిలో మార్పులు తెచ్చి ఉపాధి చూపాలి

తాడిచెట్లు తొలగించిన వారిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలి

ఎపి కల్లుగీత కార్మిక సంఘం

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి

ప్రజాశక్తి - భీమవరం

రాష్ట్రంలో అక్రమ మద్యం ఏరులై పారుతుందని, నియంత్రించాల్సిన ప్రభుత్వం పట్టించుకోవట్లేదని ఎపి కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి విమర్శించారు. బెల్ట్‌షాపులు నిర్వహిస్తే బెల్టు తీస్తామని గొప్పలు చెప్పిన సిఎం చంద్రబాబు 70 వేలకుపైగా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నా పట్టనట్లు ఉండటం వెనుక కారణం ఏమిటని ప్రశ్నించారు. ఇదంతా బహిరంగంగా జరుగుతున్న ఎక్సైజ్ శాఖ ఉత్సవ విగ్రహంలా తయారైందని విమర్శించారు. దీంతో కల్లుగీత వృత్తి మనుగడే ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో ఎపి కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం సంఘం జిల్లా అధ్యక్షులు కామన మునిస్వామి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథి నరసింహమూర్తి మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా కల్లు గీత వత్తిలో మార్పు తీసుకురావాలన్నారు. గీత వృత్తిని కేరళ, తెలంగాణ రాష్ట్రాల వలె అభివృద్ధి చేయాలని, లక్షలాది కుటుంబాలకు ఉపాధి కల్పించి ఆదుకోవాలని అన్నారు. బెల్ట్ షాపులు నడిపితే మద్యం దుకాణాల లైసెన్సులు రద్దు చేస్తామని ముఖ్యమంత్రి హెచ్చరించినా ఫలితం లేదన్నారు. పొరుగు ప్రాంతాల నుండి అక్రమ మద్యం వరదల వస్తున్నా నియంత్రణ లేదని విమర్శించారు. తాటి కల్లు అమ్మకాలను దెబ్బ తీస్తున్న అక్రమ మద్యం, బెల్ట్ షాపులను తక్షణం అరికట్టి లక్షలాది గీత కార్మిక కుటుంబాలను కూటమి ప్రభుత్వం బాధ్యతగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారిందిగానీ విధానాల్లో మార్పు లేదని విమర్శించారు. జిల్లా అధ్యక్షులు కామన మునిస్వామి మాట్లాడుతూ బెల్ట్‌షాపులు, అక్రమ మద్యం అరికట్టలేని ఎక్సైజ్ శాఖ గీత కార్మికుల ఇళ్లపై దాడులు చేయడం సిగ్గుచేటన్నారు. వృత్తిలో ప్రమాదం జరిగిన వారికి టాడీ కార్పొరేషన్ ద్వారా ఆర్థిక సాయం అందించాలన్నారు. తెలంగాణలో ఇస్తున్నట్లు ఇక్కడా ఎక్స్‌గ్రేషియా అందించాలన్నారు. తాటిచెట్టుకు రూ.10 చొప్పున కిస్తీలు కట్టించుకుని చెట్టుపై హక్కు కల్పించాలన్నారు. తాటి చెట్లను నరికిన వారిపై కేసులు నమోదు చేసి తక్షణమే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బొక్కా చంటి, కడలి పాండు, బొంతు శ్రీను, దొంగ సత్యనారాయణ, కడలి బాలాజీ, జక్కంశెట్టి సత్యనారాయణ, చెల్లబోయిన వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జుత్తిగ నరసింహమూర్తి

ఆక్వా చెరువుల అక్రమ తవ్వకం ఆపాలి

కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి క్రాంతిబాబు

ప్రజాశక్తి - భీమవరం

నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా తవ్వుతున్న ఆక్వా చెరువులను వెంటనే ఆపాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కె.క్రాంతిబాబు డిమాండ్ చేశారు. పెదగరువులో దళితుల ఇళ్లను ఆనుకొని అక్రమంగా తవ్వుతున్న ఆక్వా చెరువులను శనివారం కెవిపిఎస్ బృందం పరిశీలించింది. స్థానికులను వివరాలు అడిగి తెలుసుకుంది. ఈ సందర్భంగా క్రాంతిబాబు మాట్లాడుతూ జిల్లాలో అధికారుల వైఫల్యం వల్లే అక్రమ ఆక్వా చెరువులు భారీగా పెరుగుతున్నాయని విమర్శించారు. మండలంలో ప్రతి గ్రామంలో విచ్చలవిడిగా ఆక్వా చెరువులు తవ్వుతున్నారని మండిపడ్డారు. నిబంధనలను తుంగలోకి తొక్కి అనుమతులు ఎలా ఇస్తున్నారని ప్రశ్నించారు. పెదగరువులో నిబంధనలకు విరుద్ధంగా దళితుల ఇళ్లకు చేర్చి అక్రమంగా ఆక్వా చెరువు తవ్వుతున్నారని, స్థానికుల మొర మేరకు విఆర్‌ఒ వచ్చి ఆపారని చెప్పారు. పర్యవేక్షించాల్సిన మత్స్య శాఖ, రెవెన్యూ, వ్యవసాయ, మైనింగ్ శాఖల అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఆక్వా చెరువు ఆపితే తవ్వే వ్యక్తి అక్రమ కేసు బనాయించారని, అందుకు పోలీసులు కూడా వంత పాడటం అన్యాయమన్నారు. క్షేత్రస్థాయి పరిశీలన లేకుండా స్థానికులను భయభ్రాంతులకు గురిచేయడం దారుణమన్నారు. తక్షణం అక్రమ ఆక్వా చెరువు తవ్వడాన్ని పూర్తిగా ఆపేయాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఇంజేటి శ్రీనివాస్, స్థానికులు పాలపర్తి జ్ఞానరాజు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న కెవిపిఎస్ నేతలు

సివిల్ ఇంజనీర్లు దేశ నవనిర్మాణ ప్రగతికి తోడ్పడాలి

డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణంరాజు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

సివిల్ ఇంజనీర్లు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, నూతన టెక్నాలజీని ఉపయోగించి దేశ నవనిర్మాణ ప్రగతికి కృషిచేయాలని ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు కోరారు. భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నేషనల్ టెక్నికల్ టెక్స్టైల్ మిషన్(ఎన్‌టిటిఎం), మినిస్ట్రీ ఆఫ్ టెక్స్టైల్స్, సిఎస్ఐఆర్-సిఆర్ఆర్ఐ(సెంట్రల్ రోడ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్) స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమంలో భాగంగా ది అప్లికేషన్ ఆఫ్ జియో సింథటిక్ ఇన్ రోడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్ట్స్ అనే అంశంపై కేంద్ర ప్రభుత్వ సంస్థల ఆధ్వర్యంలో ఐదు రోజులపాటు ఈనెల 18 నుంచి 22వ తేదీ వరకు జరిగిన శిక్షణ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన ముగింపు కార్యక్రమానికి ఆర్‌అండ్‌డి డీన్ డాక్టర్ పి.వంశీ నాగరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ దేశంలో ప్రతిష్టాత్మకమైన శిక్షణా కార్యక్రమాన్ని ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేయటం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. గత 45 సంవత్సరాలుగా ఎంతో ప్రగతి సాధించిన ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల డీమ్డ్ యూనివర్సిటీ స్థాయికి ఎదిగిందని, దీనిని యూనివర్సిటీగా అభివృద్ధి చేయాలని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఎస్ఆర్‌కె.నిశాంత్ వర్మకు సూచించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో న్యూఢిల్లీ నుండి వచ్చిన సిఎస్ఐఆర్, సిఆర్ఆర్ఐ చీఫ్ సైంటిస్ట్ అండ్ ప్రాజెక్టు లీడర్ డాక్టర్ పిఎస్.ప్రసాద్ మాట్లాడుతూ జియో సింథటిక్స్ రోడ్ల నిర్మాణంలో టెక్నికల్ టెక్స్టైల్ వంటి వాటిని ఉపయోగించటం వలన మంచి ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న సివిల్ ఇంజనీర్లకు డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు చేతుల మీదగా సర్టిఫికెట్లు అందించారు.



విద్యార్థులకు సర్టిఫికెట్ అందజేస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురాం కృష్ణంరాజు

లంక మట్టి అక్రమ రవాణా!

పెనుగొండ : సిద్ధాంతం వశిష్ట గోదావరి మధ్యలో ఏర్పడిన సుమారు 70 ఎకరాల లంక భూములను తవ్వుకుని రవాణా చేసుకోవడానికి కాంట్రాక్టర్లు సన్నాహాలు చేసుకుంటున్నారు. ఈమేరకు సిద్ధాంతం పెరుగులంక భూములను తవ్వేందుకు శనివారం ఉదయం ప్రొక్లైనర్‌తో గోపాలపురం ఇసుక రేవు నుంచి లంక వరకు రవాణా మార్గం ఏర్పాటు చేశారు. సిద్ధాంతం గ్రామ రైతులు లంక మట్టిని తవ్వేందుకు సన్నాహాలు చేయడం అన్యాయమని రైతులు వాపోతున్నారని సిపిఎం సిద్ధాంతం గ్రామ శాఖ కార్యదర్శి కప్పల రత్నరాజు, జిల్లా నాయకులు కేతా గోపాలన్, సిపిఎం మండల కార్యదర్శి షేక్ పాదుషా తెలిపారు. నిరుపేదలైన రైతులకు పెరుగులంక భూములను పంచాలని ఇదివరకే సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన చేయడం జరిగిందన్నారు. దానికి భిన్నంగా అధికార పార్టీ ఎంఎల్ఎ ఆశీస్సులతో లంక మట్టి తవ్వకాలు చేపట్టడానికి రైతుల అనుమతి లేకుండా లంకల సొసైటీ ప్రెసిడెంట్‌తో కుమ్మక్కై తవ్వకాలకు సిద్ధమయ్యారని రైతులు చెప్పారన్నారు. గత ప్రభుత్వం అక్రమాలకు పాల్పడిందని చెబుతున్న అధికార కూటమి ప్రభుత్వం లంక భూములు అక్రమ తవ్వకాలకు పాల్పడడం ప్రజలందరూ ఖండించాలని అన్నారు. తక్షణం లంక భూములు తవ్వకాలను నిలుపుదల చేయాలని, ప్రొక్లైనర్‌ను స్వాధీనం చేసుకోవాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దార్ బి.అనిత కుమారికి వినతిపత్రం సమర్పించారు. సిపిఎం జిల్లా నాయకుడు ఎస్.వెంకటేశ్వరరావు, మాదాసు నాగేశ్వరరావులు పాల్గొన్నారు.

సిద్ధాంతం భూములను పరిశీలిస్తున్న సిపిఎం నేతలు

'కేన్సర్‌పై మహిళలు అప్రమత్తంగా ఉండాలి'

తాడేపల్లిగూడెం : కేన్సర్‌పై మహిళలు అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ వైద్య నిపుణులు(ఏలూరు) డాక్టర్ బి.సింధు సూచించారు. ఎపి నిట్‌లోని మహిళలకు బ్రెస్ట్ కేన్సర్‌పై శనివారం అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి డాక్టర్ సింధు మాట్లాడుతూ కేన్సర్‌లో ఎన్నో రకాలున్నాయని, వాటిలో మహిళలను అంతులేని భయానికి గురిచేస్తుంది బ్రెస్ట్ కేన్సర్ అని చెప్పారు. ఈ బ్రెస్ట్ కేన్సర్ మహిళలకే కాకుండా మగవారికి కూడా వస్తుందన్నారు. వయస్సుతో సంబంధం లేకుండా వచ్చే ఈ కేన్సర్ మహమ్మారిని మొదటి దశలోనే గుర్తిస్తే ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చని వివరించారు. ఎపి నిట్ వైద్యాధికారి డాక్టర్ ధర్మతేజ మాట్లాడుతూ కేన్సర్ రకాలు, కేన్సర్ రావడానికి గల కారణాలు, వాటి లక్షణాలు, ఆధునిక చికిత్సా విధానాల గురించి వివరించారు. అనంతరం సింధును ఆచార్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ డాక్టర్ హిమ బిందు, అసోసియేట్ డీన్ డాక్టర్ రాజేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి

పలుచోట్ల ఘనంగా అంతర్జాతీయ జల దినోత్సవం

ప్రజాశక్తి - గణపవరం

మంచినీటిని పొదుపుగా వాడకపోతే రానున్న కాలంలో నీళ్లకోసం యుద్ధాలు జరుగుతాయని గణపవరం డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి అన్నారు. శనివారం ప్రపంచ జలదినోత్సవం సందర్భంగా కాలేజీలో నీటి ఆవశ్యకతపై విద్యార్థులకు జరిగిన అవగాహనా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. నీటిని అవసరం మేరకు మాత్రమే వాడుకోవాలని, వృధా కాకుండా చూసుకోవాలని చెప్పారు. నీటి ఆవశ్యకతపై పవర్ ప్లాంట్‌పై విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ వైస్ ప్రిన్సిపల్ పి.మధురాజు, లెక్చరర్లు సిహెచ్.చైతన్య, పి.గణేష్ కుమార్, ఎన్‌విఎన్‌బి.శ్రీనివాస్ రావు, ఎన్ఎన్ఎస్‌ఒ పిఒలు జి.వెంకటరమణ, పి.భాస్కరరావు పాల్గొన్నారు.

పాలకొల్లు : స్థానిక శ్రీఅద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ కళాశాలలో(స్వయంప్రతిపత్తి) ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా వ్యాయామ విద్యా విభాగం తరపున జలశక్తి అభియాన్‌లో భాగంగా నీటి వినియోగంపై అవగాహనా ర్యాలీ జరిగింది. ఈ కార్యక్రమానికి కళాశాల వైస్ ప్రిన్సిపల్ టి.కృష్ణ అధ్యక్షత వహించి, నీటి ఉపయోగాలు, నీటి వృధా తగ్గించి భావితరాలకు అందించటంలో మన పాత్ర గురించి వివరించి, జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ విద్య ఇన్‌ఛార్జి డాక్టర్ ఎం.రామకృష్ణ, వ్యాయామ విద్యా అధ్యాపకులు జి.మహేష్ పాల్గొన్నారు. పాలకొల్లు పట్టణంలోని జివిఎస్‌వి ఆర్ఎం మున్సిపల్ పాఠశాలలో అంతర్జాతీయ జల దినోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం భవానీ ప్రసాద్ రాయపూడి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఎన్నో జీవాలు కలిగిన ఏకైక గ్రహం భూమి అని, ఈ జీవులన్నిటికీ మనుగడకు నీరు ఎంతో అవసరమని, అటువంటి నీటిని జాగ్రత్తగా ఉపయోగించుకోవాలని కోరారు. నీరు కలుషితం అవ్వకుండా కాపాడుట మన అందరి నైతిక బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నరసాపురం : ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. నీటి సంరక్షణ-భవిష్యత్ తరాల కోసం అనే థీమ్‌తో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.గోపీచంద్, జివిఎల్ఎస్.మూర్తి సివిల్ విభాగాధిపతి హాజరై మాట్లాడారు. మాట్లాడుతూ నీరు జీవనాధారం, దీన్ని సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యతన్నారు. నీటి వనరులను ఆదా చేయడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించవచ్చు అని సూచించారు. కళాశాల ఎన్ఎస్-ఎస్ కోఆర్డినేటర్లు విస్సా మాణిక్యాలరావు, ఎంవి.కృష్ణమోహన్ విద్యార్థులకు నీటి ప్రాముఖ్యతను వివరించారు. విద్యార్థులు జల సంరక్షణపై అవగాహనా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ కెవి.సత్యనారాయణ, కళాశాల డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, కోశాధికారి కెవి.స్వామి పాల్గొన్నారు.

పాలకొల్లు మున్సిపల్ స్కూల్లో ఘనంగా అంతర్జాతీయ జల దినోత్సవం

గణపవరంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ నిర్మలాకుమారి

ప్రభుత్వ నిర్లక్ష్యం.. ప్రజలకు ప్రాణాంతకం..!

రెండు జిల్లాల్లోనూ కొన్ని పట్టణాల్లో ఈగల్, డ్రగ్స్ కంట్రోల్, పోలీసు విభాగాల ఆధ్వర్యాన మందుల దుకాణాల్లో నిర్వహించిన దాడుల్లో విస్మయపర్చే అంశాలు వెలుగులోకొచ్చాయి. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నా పాలకులు, అధికార వ్యవస్థలు ఏం చేస్తున్నాయనే ప్రశ్న అందరినీ వేధిస్తోంది. ఇక ప్రజా ఉద్యమాల రథసారధి సిపిఎం ప్రజాచైతన్య యాత్రల బృందాలకు జనం ఇస్తున్న వినతులు నెలకొన్న అపరిష్కృత సమస్యలకు ప్రతిబింబంగా చెప్పుకోవచ్చు.

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఏకకాలంలో పలు పట్టణాల్లోని మందుల దుకాణాల్లో సంబంధిత అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రధానంగా నిషేధిత మందులు విక్రయించడం ఒక ఆందోళనకర అంశమైతే, కాలం చెల్లిన మందులను యథేచ్ఛగా వినియోగదారులకు నిర్వాహకులు విక్రయిస్తుండటం అత్యంత ప్రమాదకర అంశంగా తెరపైకి వచ్చింది. గ్రామాల్లో అయితే రోజువారీ కూలీలు, ఇతర పేదలు మందుల దుకాణాల వారు ఇచ్చిన మందులే వాడుతుంటారు. పట్టణాల్లోనే యథేచ్ఛగా కాలం చెల్లిన మందులు వాడుతున్నారంటే ఇది కేవలం మందుల దుకాణాల యజమానుల బరి తెగింపుగానే చూడలేం. సంబంధిత అధికారుల అండ, అవినీతి ప్రధాన కారణమని ప్రచారం సాగుతోంది. కాలం చెల్లిన మందులు వాడటం వల్ల రోగం తగ్గకపోగా మరిన్ని సమస్యలు ఉత్పన్నమవుతాయని వైద్యులు చెబుతున్నారు. మరి అటువంటి మందులు విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతున్న వారిపై తూతూమంత్రంగా కేసులు నమోదు చేసి చేతులు దులుపుకోవడం సర్వత్రా చర్చనీయాంశమైంది. ఆయా మందుల దుకాణాల నిర్వాహకులకు అనుమతులు రద్దు చేయడంతోపాటు క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇక నిషేధిత మందులు ప్రధానంగా మత్తు మందులు, ఇంజెక్షన్లు ఎటువంటి ప్రిస్క్రిప్షన్ లేకుండా విచ్చలవిడిగా విక్రయిస్తుండటం ఆందోళన కల్గించే విషయమే. జిల్లాలో నకిలీ మందుల రాకెట్ కార్యకలాపాలు పెద్దఎత్తున సాగుతున్నాయనే ప్రచారం సాగుతోంది. దీనికి రాజకీయ ప్రముఖుల అండదండలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వదిలేసి తమ జేబులు నింపుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా నకిలీ, కాలం చెల్లిన మందుల విక్రయదారులపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపకపోతే ప్రజల ప్రాణాలకు ప్రమాదమని పలువురు హెచ్చరిస్తున్నారు.

సిపిఎం ఆధ్వర్యాన ప్రజాచైతన్య యాత్రలు రెండు జిల్లాల్లో పెద్దఎత్తున సాగుతున్నాయి. పశ్చిమగోదావరి జిల్లాలో సైకిల్ యాత్ర అత్యంత ఉత్సాహంగా సాగి గత సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నాతో ముగిసింది. ప్రధానంగా సొంత గూడు కోసం జనం ఏస్థాయిలో ఇబ్బందులు పడుతున్నారో సైకిల్ యాత్రకు వెల్లువెత్తిన వినతులు చెప్పకనే చెబుతున్నాయి. అధికారులు సైతం ఈ సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించడం సిపిఎం విజయంగా చెప్పొచ్చు. ఇక ఏలూరు జిల్లాలో ఆయా ప్రాంతాల వారీగా యాత్రలు పెద్దఎత్తున సాగుతున్నాయి. దీర్ఘకాలిక సమస్యల పరిష్కారంలో అధికారులు, ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి ఈ యాత్రల సందర్భంగా మరోసారి తేటతెల్లమైంది. పోలవరం నిర్వాసితులు, జంగారెడ్డిగూడెం, టి.నర్సాపురం, చింతలపూడి, దెందులూరు తదితర ప్రాంతాల్లో భూసమస్యలు జనాన్ని పట్టిపీడిస్తున్నాయి. ఇక విద్య, వైద్యం, రోడ్లు, డ్రెయినేజీలు, తాగునీరు వంటి సమస్యపై వినతులు కోకొల్లలుగా వస్తున్నాయి. ఇప్పటికైనా పాలకులు స్పందించి ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటే ప్రజాపాలన సాగుతున్నట్లు జనం భావిస్తారు. లేనిపక్షంలో ఆందోళన బాట పడతారనడంలో ఎటువంటి సందేహమూ లేదు.



- విఎస్ఎస్‌వి.ప్రసాద్

13న గురుకులాల ప్రవేశ పరీక్ష

నరసాపురం : మండలంలోని ఎలిబి చర్ల అంబేద్కర్ గురుకుల పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరంలో 5వ తరగతి, ఇంటర్ ఫస్ట్ ఇయర్ ప్రవేశాల ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ఈనెల 13వ తేదీతో ముగిసినట్లు గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ నల్లి సాయిబాబు అన్నారు. ఈ ప్రవేశ పరీక్షను ఏప్రిల్ 6న నిర్వహించాల్సి ఉండగా అనివార్య కారణాలతో ఏప్రిల్ 13వ తేదీకి వాయిదా పడిందన్నారు. ఏప్రిల్ 13వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు 5వ తరగతి, మధ్యాహ్నం రెండు గంటల నుంచి నాలుగు గంటల వరకు ఇంటర్ ప్రవేశ పరీక్షలు జరుగుతాయని ప్రిన్సిపల్ సాయిబాబు తెలిపారు.

గ్రామాలాభివృద్ధికి కృషి : ఎంఎల్ఎ

గణపవరం : కూటమి ప్రభుత్వంలోనే గ్రామాలాభివృద్ధి సాధ్యమని ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు అన్నారు. శనివారం కాశిపాడులో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో రూ.9 లక్షలతో నిర్మించిన సిసి రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా ధర్మరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన 9 నెలల్లో కేంద్రం సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలు పూర్తిచేయడం జరుగుతుందని చెప్పారు. రాష్ట్రంలో పోలవరం, అమరావతి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. అంతేకాకుండా ఇక్కడి ఫ్యాక్టరీ ప్రయివేటీకరణ ఆపటంతో పాటు పెట్టుబడులు తీసుకొచ్చి కేంద్ర బడ్జెట్లో రాష్ట్రా నికి పెద్ద పీటం వేయటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, వీర మహిళలు, అధికారులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన

భీమవరం టౌన్ : ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు కటక్‌లో జరుగనున్న జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అభినందించారు. శనివారం భీమవరం ఫెన్సింగ్ క్లబ్ చెందిన కె.ప్రేక్షిత్ మంతెన సమీక్ష, దంతులూరి వర్షిత్, బి.శశి కార్తికేయ ఈనెల 2వ తేదీన కంచికచర్లలో జరిగిన అండర్-14 ఫెన్సింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించారు. కాకినాడలో జరిగిన అండర్-17 ఫెన్సింగ్ పోటీల్లో పి.రేవంత్ సిల్వర్ మెడల్ సాధించారని కోచ్ గుణ్ణం కృష్ణమోహన్ తెలిపారు. వారిని ఎంఎల్ఎ అంజిబాబు అభినందించారు.

27న మహాజన సభ

మొగల్తూరు : మొగల్తూరులోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ మహాజన సభను ఈనెల 27వ తేదీ గురువారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించనున్నామని ఆ సంఘ సిఇఒ కొత్తపల్లి గోవిందరాజులు తెలిపారు. ఈ సమావేశానికి రైతులందరూ హాజరుకావాలని ఆయన కోరారు.

గురుకులాల్లో ప్రవేశానికి గడువు పొడిగింపు

పెనుమంట్ర : మార్టేరు సమీపంలోని నెగ్గిపూడిలో మహాత్మా జ్యోతి బాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల పెనుగొండ(నెగ్గిపూడి)లో ఎంట్రన్స్ ఎగ్జామ్ ద్వారా చేరేందుకు దరఖాస్తు చేసుకునే గడువు ఈనెల 25వ తేదీ వరకు పొడిగించినట్లు ప్రిన్సిపల్ ఎం.పద్మ శనివారం ఇక్కడ తెలిపారు. రాబోయే 2025-26 విద్యా సంవత్సరంలో 5వ తరగతి లోను, ప్రస్తుతం ఉన్న బ్యాక్ లాగ్ 6, 7, 8, 9 తరగతుల్లో చేరేందుకు అర్హత కలిగిన విద్యార్థులు %mjpapbcwreis.afcfss.in% ద్వారా దరఖాస్తు చేసుకొని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

నేడు విద్యుత్ సరఫరా పలుచోట్ల నిలిపివేత

గణపవరం : మండలంలో ఆదివారం వరదరాజపురం సబ్ స్టేషన్ పరిధిలోగల వరదరాజపురం, అర్ధవరం, వల్లూరు, వాకపల్లి, వీరేశ్వరపురం, ముగ్గళ్ల, కొత్తపల్లి గ్రామాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ అంతరాయం కలగుతుందని తాడేపల్లిగూడెం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.నరసింహమూర్తి శనివారం తెలిపారు. ఆయా గ్రామాల ఆక్వా రైతులు గమనించుకోవాలని కోరారు. గ్రామాల్లో కొత్త, పాత విద్యుత్ లైన్లు మరమ్మతులు చేయటం జరుగుతుందని అన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

తాడేపల్లిగూడెం : 33/11 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ హౌసింగ్ బోర్డు పరిధిలో మరమ్మతుల నిమిత్తం ఆదివారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.నరసింహమూర్తి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. హౌసింగ్ బోర్డు, శశి కాలేజ్, పాలిటెక్నిక్ కాలేజ్, గాంధీబొమ్మ సెంటర్, గణేష్ నగర్, గవర్నమెంట్ హాస్పిటల్ రోడ్, సత్యవతి నగర్, వీకర్స్ కాలనీ, ఎఫ్‌సిఐ కాలనీ, అబ్బులకొట్టు సెంటర్ ఏరియాలలో మరమ్మత్తుల నిమిత్తం ఆదివారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని, కావున పట్టణ వినియోగదారులు సహకరించాల్సిందిగా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విజ్ఞప్తి చేశారు.

నేడు నిరక్షరాస్యులకు పరీక్ష

పెనుమంట్ర : మండలంలోని 18 గ్రామ పంచాయతీలలో నడుస్తున్న డ్వాక్రా గ్రూపులలో గుర్తించిన 200 మంది నిరక్షరాస్యులకు ఈనెల 23వ తేదీ ఆదివారం వయోజన విద్య వారు ఇచ్చిన సిలబస్ మీద పరీక్షలు నిర్వహిస్తున్నట్లు మండల డ్వాక్రా సంస్థ ఎపిఎం పి.పద్మ శనివారం ఇక్కడ తెలిపారు. గతంలో మండలంలోని ఉన్న డ్వాక్రా సంఘాలలో గుర్తించిన నిరక్షరాస్యులు అందరికీ వయోజన విద్య, సెర్ప్(ఉల్లాస్) వారి సంయుక్త ఆధ్వర్యంలో ఏపిఎంలకు గత సంవత్సరం నవంబర్ నుంచి శిక్షణ ఇచ్చి, వారు సాధించిన సామర్థ్యాలను మూల్యాంకనం కోసం ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ పరీక్షలలో అంగన్వాడీ టీచర్లని ఇన్విజిలేటర్లుగా వేసినట్లు ఆమె తెలిపారు.

తాతారావు కుటుంబ సభ్యులకు పరామర్శ

భీమవరం టౌన్ : తాడేరు మాజీ సర్పంచ్ బండి కాత్యాయని మృతికి రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) శనివారం సంతాపం తెలిపారు. వారి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భర్త తాతారావు, వారి కుటుంబ సభ్యులను ఎంఎల్ఎ అంజిబాబు పరామర్శించారు.

విద్యార్థినులు జీవితంలో విజయం సాధించాలి

గైనకాలజిస్టు సి.వెంకటఉషారాణి

తణుకు : చదువుతో పాటు సంస్కృతి, సాంప్రదాయాలు ఆచరించి, విద్యార్థినులు జీవితంలో విజయం సాధిస్తే అదే అధ్యాపకులకు ఇచ్చే గురుదక్షిణ అవుతుందని గైనకాలజిస్టు సి.వెంకటఉషారాణి అన్నారు. శనివారం స్థానిక ఎస్‌కెఎస్‌డి మహిళా డిగ్రీ, పీజీ(అటానమస్) కళాశాలలో వీడ్కోలు సభ కళాశాల ప్రిన్సిపల్ యు.లక్ష్మీసుందరీబాయి అధ్యక్షతన జరిగింది. జూనియర్ విద్యార్థినులు సీనియర్ విద్యార్థినులకు ఉత్సాహంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా వెంకట ఉషారాణి మాట్లాడుతూ విద్యార్థినులు కష్టపడి చదవాలని, కుటుంబ వ్యవస్థ బాగుండాలని ప్రతి విద్యార్థినీ ధృక్పథం అలవరుచుకోవాలన్నారు. సోషల్ మీడియా, రీల్స్ వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. అనంతరం డాక్టర్ సి.వెంకటఉషారాణిని కళాశాల యాజమాన్యం సత్కరించారు. చిట్టూరి రీనాసాయి, సందీప కుమార్ పాల్గొన్నారు.

వైఎన్‌లో కెరీర్ నిర్మాణంపై వర్క్‌షాప్

నరసాపురం : స్థానిక వైఎన్ కళాశాల కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంటుల సంయుక్త ఆధ్వర్యంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ యుగంలో కెరీర్ నిర్మాణం అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో ప్రధాన అతిథిగా ఇండియన్ ఇమ్యూనోలాజికల్ లిమిటెడ్, హైదరాబాద్‌లోని ఫైనాన్స్ జనరల్ మేనేజర్ ప్రసాద్ శ్రీరామ కవచం పాల్గొన్నారు. ఈ వర్క్‌షాప్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ రంగంలో వాణిజ్య నిర్వహణలో ఉన్న కెరీర్ మార్గాలపై విద్యార్థులకు విలువైన సూచనలు అందించారు. ప్రసాద్ శ్రీరామకవచం విద్యార్థులకు వాణిజ్య, నిర్వహణ రంగాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ ప్రభావం పెరిగిపోతున్న నేపథ్యంలో కొత్త అవకాశాలను గురించి వివరించారు. ఈ రంగాలలో కెరీర్ కోసం అవసరమైన నైపుణ్యాలు, విద్యపై అవగాహన పెంచుకోవాలని సూచిస్తూ విద్యార్థులకు రిస్క్ మేనేజ్‌మెంట్, ఇన్సూరెన్స్ మేనేజ్‌మెంట్, ఫైనాన్షియల్ అల్గోరిథం, సోషల్ ఎంట్రప్రెన్యూర్‌షిప్, ఫైనాన్షియల్ కంటెంట్ రైటింగ్, డిజిటల్ మార్కెటింగ్ వంటి విభాగాల్లో సర్టిఫికేషన్లు పొందాలని సూచించారు. ఈ వర్క్‌షాప్‌కి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కనకారావు అధ్యక్షత వహించారు. రీసెర్చ్ అండ్ అకడమిక్ అడ్వైజర్ ఆర్‌వి.సుబ్బారావు, పిజి డైరెక్టర్ డాక్టర్ ఎస్.చింతారావు, మేనేజ్‌మెంట్ స్టడీస్ హెడ్ డాక్టర్ ఆర్.పార్థసారధి పాల్గొన్నారు.

ఏడుగురిపై బైండోవర్

తాడేపల్లిగూడెం : తాడేపల్లిగూడెం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో డ్యూటీ పెయిడ్ లిక్కర్ కేసులలో పట్టుబడిన ఏడుగురు వ్యక్తులను పెంటపాడు మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ వారి ఎదుట హాజరుపరచినట్లు తాడేపల్లిగూడెం ఎక్సైజ్ సిఐ ప్రసన్న కుమార్ శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆ ఏడుగురు వ్యక్తులు ఏడాది పాటు ఒక సంవత్సర కాలానికి రూ.లక్ష 50 వేలు బాండ్ విలువకు బైండోవర్ చేయడమైనదన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజాపక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 94900 99180
పశ్చిమగోదావరి జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ఫెన్సింగ్ తొలగింపుపై రైతుల హర్షం

ప్రజాశక్తి వార్తకు స్పందన



తొలగించిన పెన్సింగ్

పెనుమంట్ర : మండలంలోని మార్టేరు-తాడేపల్లిగూడెం రోడ్డులో ఆలమూరు వద్ద ఐఎంసి ఆయిల్ కంపెనీ బోర్ వద్ద వేసిన పెన్సింగ్ తొలగించి, రైతుల ఇబ్బందులు తీర్చినందుకు ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఇక్కడ ఆయిల్ కంపెనీ వేసిన పెన్సింగ్ వల్ల తమ పొలాలకు పనుల నిమిత్తం వెళ్లే రైతులకు ఇబ్బందిగా మారిన విషయాన్ని ప్రజాశక్తి పత్రిక వెలుగులోకి తెచ్చిందని, దానికి స్పందించిన సంబంధిత అధికారులు, ఆయిల్ కంపెనీ యాజమాన్యం పెన్సింగ్ తొలగింపుకు సహకరించారని వారు పేర్కొన్నారు. ఈమేరకు శనివారం రైతు ప్రతినిధులు గుడిమెట్ల శివ శంకరరెడ్డి, చెల్లూరి ఆదిమూర్తి, దింటకుర్తి వెంకటేశ్వరరావు, కొవ్వూరి భాస్కరరెడ్డి, కర్రి సుబ్బిరెడ్డి, చిర్ల సత్యనారాయణ రెడ్డి, గండి శ్రీను, మల్లిపూడి నాగేశ్వరరావు, మల్లిపూడి శ్రీను, ద్వారంపూడి లక్ష్మణరెడ్డి, పడాల ప్రసాంత్ రెడ్డి ప్రజాశక్తికి కృతజ్ఞతలు తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి : ఎంఎల్ఎ

గణపవరం : జీవనానికి అవసరమైన తాగునీటిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాయని ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు అన్నారు. శనివారం ముగ్గళ్ల గ్రామంలో జల జీవన మిషన్ నిధులు రూ.48 లక్షల 50 వేల వ్యయంతో 45 వేల లీటర్ల నిల్వగల ఒ.హెచ్ఎస్ఆర్ వాటర్ ట్యాంకు నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమం చేసి మాట్లాడారు. గతంలో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడేవారని అన్నారు. నేడు కేంద్ర ప్రభుత్వ సహకారంతో కూటమి ప్రభుత్వం సమస్య పరిష్కారానికి కృషిచేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 49 మందికి ఉద్యోగాలు

ఆకివీడు : రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ కెరీర్ సర్వీస్ సంస్థ, మండలంలోని దుంపగడప వివి గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం నిర్వహించిన మెగా జాబ్ మేళాలో 49 మందికి ఉద్యోగాలు లభించాయి. ఈ మేళాలో పాల్గొనేందుకు ఆన్లైన్ రిజిస్ట్రేషన్ సైతం ఆహ్వానించడంతో 220 మంది తమ పేర్లు నమోదు చేయించుకున్నారు. మొత్తం 12 కంపెనీలు పాల్గొన్న ఈ మేళలో దరఖాస్తుదారులు 166 మంది పాల్గొన్నారు. వాళ్లలో 49 మందిని పలు కంపెనీలు ఉద్యోగాల కోసం ఎంపిక చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.శారద తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రణాళికాభివృద్ధి విభాగం కార్యదర్శి డాక్టర్ పిబి.ప్రతాప్ కుమార్, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారులు లోకనాథ్, నేషనల్ కెరీర్ సంస్థ ప్రతినిధులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇపిఎఫ్ పెన్షన్ పెంచండి

వృద్ధులకు భద్రత కల్పించండి : బొబ్బిలి బంగారయ్య

ఆకివీడు : రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులకు ప్రభుత్వం అందించే ఇపిఎఫ్ పెన్షన్ పెంచి వృద్ధుల జీవితాలకు భద్రత కల్పించాలని సహకార సంస్థల రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు, వినియోగదారుల సంఘాల రాష్ట్ర సహాధ్యక్షులు బొబ్బిలి బంగారయ్య డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేవలం రూ.1000, రూ.1500తో జీవించడం దారుణమన్నారు. ఏళ్ల తరబడి పెన్షన్ పెరుగుతుందన్న ఆశతో ఎదురు చూడడం సర్వసాధారణమై పోయిందన్నారు. సహకార శాఖ, కార్మికులు, ప్రయివేటు ఉద్యోగులకు ప్రభుత్వం న్యాయం చేయాలన్నారు. ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చిన కూటమి ప్రభుత్వం సామాన్య ఉద్యోగుల పెన్షన్ పెంచకపోవడం దారుణమన్నారు. యూట్యూబ్ ఛానల్‌లో అక్రమ వార్తలు నిలుపుదల చేయాలని, కేంద్ర ప్రభుత్వం వెంటనే ఇపిఎఫ్ పెన్షన్ పెంచాలని డిమాండ్ చేశారు.

సమ్మె కాలపు హామీలు అమలు చేయాలి

అంగన్వాడీ జిల్లా నాయకులు బి.కళ్యాణి

పాలకొల్లు : అంగన్వాడీలకు సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలు ప్రభుత్వం అమలు చేయాలని అంగన్వాడీ జిల్లా నాయకులు బి.కళ్యాణి డిమాండ్ చేశారు. శనివారం ఎఎంసి గోడౌన్స్ షెడ్‌లో జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గత సంవత్సరం తమ సమస్యల పరిష్కారం కోసం 42 రోజులు సమ్మె చేసారని, సమస్యలు పరిష్కారం చేస్తామని చర్చలు ద్వారా ప్రభుత్వం హామీ ఇచ్చిందని చెప్పారు. కొత్త ప్రభుత్వం వచ్చి 10 నెలలు కావొస్తున్న ఇచ్చిన హామీల అమలుకు చర్యలు శూన్యం అన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచి, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీలకు ఇస్తానన్న గ్రాడ్యుటీని మార్పు చేసి మెరుగైన గ్రాడ్యుటీ ఇచ్చే విధంగా జిఒ ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుకు మరో పోరాటానికి సిద్ధపడాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు ప్రస్తుత రాజకీయ రిపోర్టును ఇచ్చారు. దీనిలో అంగన్వాడీ నాయకులు వై.రాణి, సిహెచ్.శ్రీదేవి, నాగలక్ష్మి, ఝాన్సీ, రజని, ఎ.కనకదుర్గ, సిఐటియు నాయకులు జవ్వాది శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన

తాడేపల్లిగూడెం: ప్రపంచ క్షయ వ్యాధి నివారణా దినోత్సవం సందర్భంగా శనివారం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో స్థానిక జ్యోతి స్కూల్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థినీలతో అవగాహనా సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎంఒ డాక్టర్ సాంబశివరావు మాట్లాడుతూ రాబర్ట్ కాక్ ఈనెల 24వ తేదీన క్షయ వ్యాధి క్రిమిని కనుగొన్న కారణంగా క్షయ వ్యాధి నివారణా దినోత్సవం జరుపుకుంటున్నామని అన్నారు. క్షయ వ్యాధిని ముందుగా గుర్తించి, సకాలంలో చికిత్స అందించినట్లయితే పూర్తిగా నయమవుతుందన్నారు. క్షయ వ్యాధి నిర్మూలనలో మందులతో పాటు ప్రత్యేకమైనటువంటి పౌష్టికాహారం కూడా ముఖ్యమని తెలిపారు. అనంతరం నర్సింగ్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ డాక్టర్లు సుబ్బారావు, కీర్తి, టిబి సూపర్వైజర్లు కె.గిరిబాబు, ఎ.కృష్ణ, నాగలక్ష్మి, నరేష్, రాఘవ పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్‌పై అవగాహన

తణుకు : సాంకేతికత వికృత రూపం చూపిస్తుందని, చిక్కులు, సమస్యలు కొన్నిసార్లు ఆత్మహత్యకు దారితీసే విధంగా ఉంటుందని బెంగుళూరుకి చెందిన సైబర్ సెక్యూరిటీ నిపుణులు చింతలపాటి హరి అన్నారు. శనివారం రూట్స్ స్కూల్ ఆఫ్ ఎసెన్షియల్ ఫ్యాకల్టీస్ ఆధ్వర్యంలో స్థానిక రోటరీ క్లబ్‌లో నేటి యువతకు, వారి తల్లిదండ్రులకు ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్ ద్వారా సైబర్ క్రైమ్స్ ఎలా జరుగుతున్నాయో వాటిపై అవగాహన సదస్సు నిర్వహించారు. తణుకు టౌన్ సబ్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసరావు మాట్లాడారు. సంస్థ డైరెక్టర్స్ ఎల్‌కె.త్రిపాఠి, బి.విద్యాకాంత్, ఎన్.సుధాకరవర్మ పాల్గొన్నారు.

కిశోర వికాసంపై అవగాహన

మొగల్తూరు : విద్యార్థుల ఆటపాటలు, చదువులోను విజయం సాధించాలని లయన్స్ క్లబ్ మొగల్తూరు అధ్యక్షులు యు.గీతా రాంబాబు అన్నారు. మొగల్తూరులోని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో స్థానిక నెంబర్ టు పాఠశాల విద్యార్థులకు కిశోర వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినీలు వారి జీవితంలో ఎదురయ్యే సమస్యలను, ఎదుర్కొనే విధానాన్ని వివరించారు. అనంతరం అవగాహనా ప్రదర్శన చేశారు. ఆయా కార్యక్రమాల్లో అంగన్వాడీలు, ఆశావర్కర్‌లు ఉన్నారు.

'మధుసూదన్ రాజు ఆకస్మిక మృతి బాధాకరం'

పాలకోడేరు : గ్రామాభివృద్ధికి పరితపిస్తూ పార్టీలకు అతీతంగా అందరికీ మంచి స్నేహితుడుగా ఉండే కుముదవల్లి గ్రామ టిడిపి అధ్యక్షులు సాగి మధుసూదన్ రాజు ఆకస్మిక మృతి తీవ్ర బాధాకరమని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. శనివారం కుముదవల్లి గ్రామంలోని సాగి మధుసూదన్ రాజు నివాసానికి చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

నవ ధాన్యాలతో భూసారం పెంపు

ప్రకృతి వ్యవసాయ జిల్లా కోఆర్డినేటర్ అరుణకుమారి

ప్రజాశక్తి - వీరవాసరం

వరి చేలో కోత కోసే ముందర సరైన తేమ ఉన్నప్పుడు నవధాన్యాలు చల్లడం వల్ల భూమి సారవంతం పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయ జిల్లా కోఆర్డినేటర్ అరుణకుమారి అన్నారు. ప్రకృతి వ్యవసాయంపై మండల స్థాయి కన్వర్జెన్స్ సమావేశం వీరవాసరంలో మండల సమైక్య కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో విత్తనాలకు కావలసిన నిధుల సేకరణ, వార్షిక కార్యాచరణ ప్రణాళిక 2025-26పై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా అరుణ కుమారి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. నవధాన్యాలు వేయడం వల్ల భూమిలో సూక్ష్మజీవులు వృద్ధి చెందుతాయని చెప్పారు. ఒక్కొక్క మొక్క వేర్లు ఒక రకం బ్యాక్టీరియా అభివృద్ధి చెందుతుందని, మొక్కల పెరుగుదలకు ఈ సూక్ష్మజీవులు ఉపయోగపడతాయని చెప్పారు. అనంతరం ఎడిఎ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆర్ఎక్స్‌కె సిబ్బంది ప్రతి గ్రామంలో రైతులందరి చేత నవధాన్యాలు వేయించాలని చెప్పారు. ఎఒ బిన్నీ బాబు మాట్లాడుతూ ప్రతి రైతు నవధాన్యాలు వేయాలని తెలిపారు. ఎపిఎం జ్యోతి రాణి మాట్లాడుతూ నవధాన్యాలు తేవడానికి సిబ్బంది సంఘాల నుంచి లోన్ ఇవ్వడానికి సహకరిస్తామని చెప్పారు. పకృతి వ్యవసాయ అనుభవాలను సమావేశంలో చర్చించారు. డివిజన్ ఇన్‌ఛార్జి స్వామి, మండల ఇన్‌ఛార్జి దేవి నాగరాజు, యూనిట్ ఇన్‌ఛార్జి వినోద్ కుమార్, సిసి పద్మావతి, సిఎలు, విఎఎలు, ఐసిఆర్‌పిలు పాల్గొన్నారు.

'రైతులపై బిజెపి దాడి నిరసించాలి'

ప్రజాశక్తి - పెంటపాడు

దేశానికి అన్నం పెట్టే రైతుల మీద బిజెపి ప్రభుత్వం చేస్తున్న దమన ఖాండను నిలుపుదల చేయాలని రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు కరక వెంకట్రావు, చిర్ల పుల్లారెడ్డి తెలిపారు. శనివారం పెంటపాడు ప్రజాసంఘాల కార్యాలయం వద్ద రైతు సంఘం ఆధ్వర్యాన బిజెపి దౌర్జన్యాన్ని, రైతుల మీద పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని రైతు సంఘం ముఖ్యుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రైతు సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు కరక వెంకట్రావు, చిర్ల పుల్లారెడ్డి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపవరపు రంగారావు మాట్లాడుతూ 2020-21లో 550 రైతు సంఘాలు 13 మాసాల పాటు బిజెపి తీసుకు వచ్చిన నల్ల చట్టాలకు వ్యతిరేకంగా పోరాటం చేశారని, ఆ పోరాటంలో 750 మంది రైతులు మరణించారని ఈ దేశ ప్రధాని మోడీ నల్ల చట్టాలు వెనక్కి తీసుకుంటానని వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు కల్పిస్తానని, చనిపోయిన రైతులకు నష్టపరిహారం ఇస్తానని అనేక వాగ్దానాలు లిఖితపూర్వకంగా రాసి ఇచ్చారని వారు తెలిపారు. అయినా ఈ మోడీ ప్రభుత్వం దొడ్డిదారిన అంబానీ, ఆదానీలకు ఈ వ్యవసాయ రంగాన్ని కట్టబెట్టడానికి ప్రయత్నాలు చేస్తుందన్నారు. దానికి వ్యతిరేకంగా ఒక నాలుగు మాసాల నుంచి రైతులు శంబు, ఖానూరు ప్రాంతాలల్లో గుడారాలు వేసుకుని, ట్రాలీలు ఏర్పాటు చేసుకొని అక్కడే ఉండి నిరసన తెలియజేస్తున్నారని, ప్రభుత్వం పోలీస్ శాఖను అడ్డం పెట్టుకొని వందలాదిమంది పోలీసులను సమీకరించి వేసుకున్న గుడారాలను, వారు తీసుకోవాల్సిన ఆహార పదార్థాలను నేలమట్టం చేసిందన్నారు. వందలాది మంది రైతులను నిర్బంధించి వారి మీద కేసులు పెట్టి, ఇబ్బంది పాలు చేసిందని, దానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా రైతాంగం పెద్ద ఎత్తున ఆందోళన చెందుతున్నారని వారు తెలిపారు. ఈ దేశానికి అన్నం పెట్టే రైతుల మీద బిజెపి ప్రభుత్వం దమన ఖాండను నిలుపుదల చేయాలని, రైతుల మీద పెట్టిన కేసులను ఎత్తివేయాలని, పండించే వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెనగంటి దుర్గా దత్తు రాము, మీసాల శ్రీనివాస్, బి.శివ పాల్గొన్నారు.

ఉప కారాగారం సందర్శన

నరసాపురం : ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం అమరావతి ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లాల ప్రధాన జిల్లా న్యాయమూర్తి, ఛైర్మన్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఏలూరు సునీల్ కుమార్ శనివారం నరసాపురం ఉప కారాగారాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయమూర్తి, నిందితుల కేసు వివరాలు, వారికి అందిస్తున్న ఆహార పదార్థాలు, మంచినీటి సౌకర్యాలు, అనారోగ్యంగా ఉన్న వారికి అందించే వైద్య సదుపాయాలు ముద్దాయిలను అడిగి తెలుసుకున్నారు. జైల్ ప్రాంగణంలో ఉన్న ఉచిత న్యాయ సహాయ కేంద్రాన్ని అవసరమైన వారు ఉపయోగించుకోవాలని తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్, నర్సాపురం 10వ అదనపు జిల్లా న్యాయమూర్తి పి.విజయ దుర్గ, సీనియర్ సివిల్ జడ్జి జి.గంగరాజు పాల్గొన్నారు.

తణుకు : జిల్లా ఇన్‌ఛార్జి జడ్జి ఎం.సునీల్‌కుమార్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఏలూరు సెక్రటరీ కె.రత్నప్రసాద్‌లు శనివారం తణుకులోని సబ్ జైల్‌ను ఆకస్మికంగా సందర్శించి, రిమాండ్‌లో ఉన్న ముద్దాయిలకు అందుతున్న ఆహార వసతి, వైద్య సదుపాయాలపై అడిగి తెలుసుకున్నారు. ఆర్థిక స్తోమత లేనివారి ఆర్థిక పరిస్థితిని పరిశీలించి మండల న్యాయసేవల కమిటీ ద్వారా ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఛైర్మెన్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి పాల్గొన్నారు.

'హిజ్రా దీపు హత్యకు కారకులను ఉరితీయాలి'

తణుకు : హిజ్రా దీపు హత్య కేసులో అరెస్టైన బండి దుర్గాప్రసాద్ అలియాస్ బన్నీని ఉరి తీయాలని తణుకు హిజ్రాలు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక నరేంద్ర సెంటర్‌లో ధర్నా నిర్వహించి అనంతరం ఓవర్ బ్రిడ్జి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇరగవరం మండలం పొదలాడ గ్రామానికి చెందిన నిందితుడు బన్నీ నాలుగేళ్లుగా హత్యకు గురైన దీపుతో సహజీవనం చేస్తున్నాడని తెలిపారు. బన్నీ రెండవ పెళ్లి చేసుకోవడానికి సిద్ధపడటంతో వీరి మధ్య గొడవలు తలెత్తాయని తెలిపారు. మునగపాక మండలం నాగులపల్లిలో అద్దెకు నివాసముంటున్న ఇంట్లో కత్తితో అతి దారుణంగా, కిరాతకంగా నరికి దీపును బన్నీ హత్య చేశాడన్నారు. దీపు శరీరాన్ని ముక్కలుగా విభజించి మూటలు కట్టి పలుచోట్ల పడేశాడని తెలిపారు. ఈ సమాజంలో ఎవరికీ లేని అన్యాయం హిజ్రా దీపుకి జరిగిందని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లు స్పందించి హిజ్రా దీపుకి న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ఇకపై ఏ హిజ్రాకి ఇటువంటి పరిస్థితి రాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రాంగణ ఎంపికల్లో 56 మంది విద్యార్థులు ఎంపిక

పాలకొల్లు : స్థానిక చాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాలలో ప్రముఖ కంపెనీ కన్వర్జేన్స్ ప్రై. లిమిటెడ్ శనివారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికలకు 136 మంది విద్యార్థులు హాజరైయ్యారు. వీరికి రాత, మౌఖిక పరీక్షలు కంపెనీ హెచ్‌ఆర్.మహమ్మద్ మెయిన్ నిర్వహించారు. వీరిలో 56 మంది ఛాంబర్స్ విద్యార్థులు ఎంపికైయ్యారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు.

విజ్ఞానం పెంపునకు సైన్స్ ఎగ్జిబిషన్లు దోహదం

భీమవరం టౌన్ : యువతలో దాగివున్న నైపుణ్యాన్ని వెలికి తీయడానికి, వారికి మరింతగా విజ్ఞానాన్ని పెంపొందించడానికి సైన్స్ ఎగ్జిబిషన్లు ఎంతగానో దోహదపడతాయని భీమవరం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చీఫ్ మేనేజర్ నిర్మల జ్యోతి అన్నారు. భీమవరం త్యాగరాజ భవనంలో రెండు రోజులపాటు సర్ సివి రామన్ స్కూల్ ఏర్పాటు చేసిన ఎడ్యు ఎక్స్‌పో శనివారం ముగిసింది. ఎడ్యూ ఎక్స్ పోలో 140 మంది విద్యార్థులు వివిధ ప్రాజెక్ట్ లను ప్రదర్శించారని, 41 మంది విద్యార్థులు విజేతలుగా నిలిచారని, వారికి బహుమతులు అందజేశామని తెలిపారు.

'దుండగులపై చర్యలు తీసుకోవాలి'

భీమవరం టౌన్ : తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల గ్రామంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి గుర్తుతెలియని దుండగులు చెప్పుల దండవేసి అవమానించారని, ఇది నీచమైన పని అని బిఆర్ అంబేద్కర్ ఆశయ సాధన కమిటీ రాష్ట్ర నాయకులు కోనా జోసెఫ్ అన్నారు. శనివారం భీమవరం జెఎసి కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబేద్కర్‌ను అవమానించిన దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. **ఆచంట** : దుండగులను కఠినంగా శిక్షించాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు నన్నేటి పుష్పరాజ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి చెప్పుల దండ వేయటం రాజకీయ కోణంలో చూడాలా లేదా అనేదానిపై మాల మహానాడు పూర్తిగా నిజనిజాలను బయటపెట్టే విధంగా దర్యాప్తు పోలీసులతో కాకుండా మేము కూడా చేస్తామని పుష్పరాజ్ అన్నారు. నిందితులను పట్టుకుని వారిపై చర్యలు తీసుకోవాలని లేకపోతే మాల మహానాడు ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపట్టడానికి ఏమాత్రం వెనక అడుగు వేసే ప్రసక్తి తెలియదని పుష్పరాజ్ ధ్వజమెత్తారు.

శ్మశాన వాటిక అభివృద్ధికి విరాళం

భీమవరం టౌన్ : మండలంలోని చిన అమిరం శ్మశాన వాటిక అభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. శనివారం ఎంఎల్ఎ క్యాంప్ కార్యాలయంలో చినఅమిరం హిందూ శ్మశాన వాటికకు దాతలు రూ.50 వేలు ఎంఎల్ఎ అంజిబాబు చేతుల మీదుగా అందించారు. దాతలు గుండు కిషోర్, కురిశేటి కాశీ, కనగర్ల కిషోర్, కొత్తమసు రమేష్, మానేపల్లి నాగేశ్వరరావు, కోట్ల రామ్‌జీ, గుండు కిరణ్ కలిసి రూ.50 వేలు సహకారాన్ని కొత్వల మహేష్, పోతు శ్రీధర్‌లకు ఎంఎల్ఎ అంజిబాబు చేతుల మీదుగా అందించారు.

సమస్యలపై వాదోపవాదనలు

గందరగోళంగా మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

సమన్వయంతో సమస్యలు పరిష్కరించాలి : ఎంపిపి చంటి రాజు

పాలకోడేరు : స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపిపి భూపతిరాజు సత్యనారాయణ రాజు(చంటి రాజు) అధ్యక్షతన శనివారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గందరగోళంగా సాగింది. సమస్యలపై అటు సభ్యులు, ఇటు ప్రజాప్రతినిధులు మధ్య వాదోపవాదనలు జరిగాయి. అధికారులు కల్పించుకుని పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నం చేసినప్పటికీ సభ్యులు మధ్య తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకుంది. శృంగవృక్షం ఎంపిటిసి బల్ల భారతి కులాయి కనెక్షన్ల సమస్యలపై యాకరు పెట్టారు. చినపేటలో ఉన్న 60 సెంట్లు ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైందని చెప్పారు. దీనిపై ఫిర్యాదు చేసి రెండు నెలలు గడుస్తుందని అసలు ఏమి జరిగిందో తెలపాలని అధికారులను కోరారు. దీనిపై స్పందించిన తహశీల్దార్ ఎన్‌బి.విజయలక్ష్మి ఈ స్థలంపై విచారణ జరిగిందని, దీనికి సంబంధించిన వివరాలను పంచాయతీకి నివేదిక పంపించడం జరిగిందన్నారు. 125 కుటుంబాలు ఇక్కడే నివాసముంటున్నారని, కనీసం ఒక్క కుళాయి కూడా లేకపోవడంతో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎంపిటిసి భారతి చెప్పారు. ప్రభుత్వ స్థలంలో కుళాయి ఏర్పాటు చేసే అధికారం మీకు లేదా అని అధికారులు ప్రశ్నించారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి అడబాల కోదండరాం మాట్లాడుతూ ఎంపిటిసి చెప్పినట్లు కుళాయి లేకపోవడం వాస్తవమేన్నారు. 60 సెంట్లు భూమి శ్మశాన భూమిగా రికార్డులో ఉందని, దాని పక్క నుంచి పైపులైన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరిగిందని చెప్పారు. సర్పంచి జంగం సూరిబాబు మాట్లాడుతూ 50, 60 ఏళ్ల నుంచి ఈ 60 సెంట్లు భూమిని స్థానికంగా ఉన్న సంఘం వినియోగించుకుంటుందన్నారు. మధ్య నుంచి పైప్‌లైన్ వేస్తే ఇక్కడ కమ్యూనిటీ హాల్ ఏర్పాటుకు భంగం కలుగుతుందని ఒక వర్గం చెబుతుందన్నారు. సంబంధిత 60 సెంట్లు భూమి ఎటువంటి ఆక్రమణకు గురికాలేదని, భూమి పక్కనుంచి పైపులైన్ ఏర్పాటు చేసి కుళాయి కలెక్షన్లు అందించే విధంగా చర్యలు తీసుకున్నామని అన్నారు. గ్రామంలో పొజిషన్ సర్టిఫికెట్ లేక ఇంటి నిర్మాణాలు నిలిచిపోయే పరిస్థితి ఉందని పొజిషన్ సర్టిఫికెట్లు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అడ్డపుంతలో 15 కుటుంబాలు ఎన్నో ఏళ్ల నుంచి అక్కడే నివాసం ఉంటున్నారని, వారికి పట్టాలు ఇచ్చే ఏర్పాటు చేయాలని అధికారులకు విన్నవించారు. ఎంపిపి భూపతి రాజు చంటి రాజు మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి సమస్యలు పరిష్కరించాలన్నారు. రానున్న వేసవిలో తాగునీటికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ వి.రెడ్డియా, ఉప ఎంపిపి ఆదాడ లక్ష్మీ తులసి, ఇఒపిఆర్‌డి రాంప్రసాద్, సర్పంచులు బొల్ల శ్రీనివాస్, జంగం సూరిబాబు, కడలి నాగేశ్వరి పాల్గొన్నారు.

రహదారి పనులకు శంకుస్థాపన

నరసాపురం: గ్రామాలాభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్, నరసాపురం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ తెలిపారు. శనివారం మండలంలోని చామకూరిపాలెం గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపనలు చేశారు. సర్పంచి బొక్కా రామస్వామి, బందెల రవీంద్ర పాల్గొన్నారు.

ఛాంబర్స్ విద్యార్థుల ప్రభంజనం

పాలకొల్లు : ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం విడుదల చేసిన 5వ సెమిస్టర్ ఫలితాల్లో ఛాంబర్స్ డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు 88 శాతం ఉత్తీర్ణత సాధించారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలో 88 శాతం ఉత్తీర్ణత సాధించిన కళాశాలలు అతి తక్కువ అని, ఉత్తమ ఫలితాల సాధనలో ఛాంబర్స్ కళాశాల మొదట ఉంటుందని అన్నారు. ఈవిధంగా 9.0 నుంచి 9.9 మధ్యలో గ్రేడ్ పాయింట్స్ సాధించిన విద్యార్థులు 38 మంది అని తెలిపారు.

ప్లాస్టిక్‌ను అరికట్టాల్సిన బాధ్యత అందరిదీ

భీమవరం టౌన్ : మనమంతా ఆరోగ్యంగా ఉంటే సమాజం అభివృద్ధి పదంగా ఉంటుందని, ప్లాస్టిక్‌తో ప్రాణాంతకంగా ఉందని భీమవరం ఎండిఒ ఎన్.మురళీ గంగాధరరావు అన్నారు. శనివారం భీమవరం పురపాలక సంఘం, శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఎండిఒ, వ్యవసాయ శాఖ కార్యాలయంలో ప్లాస్టిక్ నిషేధంపై ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎండిఒ గంగాధరరావు మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధానికి ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. అనంతరం గుడ్డ సంచులను పంపిణీ చేశారు.

సిఎం సహాయనిధి అందజేత

భీమవరం టౌన్: ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం మానవ ధర్మమని, సిఎం రిలీఫ్ ఫండ్ పేదవారికి అండగా నిలుస్తుందని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. శనివారం ఎంఎల్ఎ క్యాంప్ కార్యాలయంలో 44 మంది లబ్ధిదారులకు రూ.31,04,225 చెక్కులను ఎంఎల్ఎ అంజిబాబు చేతుల మీదుగా అందించారు. **పోడూరు** : ఆచంట నియోజకవర్గంలో అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందిన 20 మంది బాధితులకు ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ రూ.17 లక్షల, 42 వేల 747 విలువ గల చెక్కులు శనివారం రాత్రి బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గుత్తుల లోకేశ్వరరావు, జవ్వాది బాలాజీ, ఏడిద శ్రీను, గూడూరి మురళీ, టిఎన్‌వి.రెడ్డి పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ పోయినది

పశ్చిమ గోదావరి జిల్లా, పెనుమంట్ర మండలం, నెలమూరు గ్రామానికి చెందిన కొడమంచిలి రమేష్ అను నేను నా యొక్క పాస్పోర్ట్ పడిపోయింది. నెలమూరు గ్రామం నుండి మోటార్ సైకిల్ పై మార్టేరు గ్రామం వెళ్తుండగా నా యొక్క **పాస్ పోర్ట్ నెం. M0551349** గల పాస్పోర్ట్ పడిపోయింది. ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్ కు తెలియజేయగలరు.

కొడమంచిలి రమేష్
తండ్రి : నాగేశ్వరరావు
డోర్ నెం : 3-56/1, అంబేద్కర్ వీధి,
నెలమూరు, పెనుమంట్ర మండలం,
ప.గో.జిల్లా, పిన్: 534126
సెల్: 84669 41397

పత్రికా ప్రకటన

మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

H.M.O.P.No. 19/2024

బిట్వీన్:-
వంక సంతోష్ ...పిటీషనర్
And
వంక వెంకట ప్రత్యూష @ వాక వెంకట ప్రత్యూష
W/o. సంతోష్ కుమార్, D/o. Late వాక వెంకట సత్యనారాయణ,
R/o. Tower Street, Narasapur. ...రెస్పాండెంట్

ఈ నెంబరు Divorce O.P లో పై రెస్పాండెంటుకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించినను ఆమె తీసుకొనక పిటిషనరును చిక్కులు పెట్టవలెననీ దురుద్దేశ్యముతో కాలయాపన చేయుచున్నందున ఆమెకు నోటీసులు అమలు జరగనందున శ్రీ కోర్టు వారు Substitute of Service ద్వారా పేపరు ప్రకటనకు ఆర్డరు వేసి పై రెస్పాండెంటు హాజరు నిమిత్తము **ది.07-04-2025వ తేదికి** వాయిదా వేసినారు. కావున సదరు రెస్పాండెంటు స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని ఆరోజు **ఉదయం 10-30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలియపర్చుకోవలెను. లేని ఎడల మీ పరోక్షమందు తీర్మానించబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

ఎస్. ఆనంద చక్రవర్తి బి.కాం.,బి.ఎల్
నరసాపురం అడ్వకేట్
తేది:21-03-2025 నరసాపురం
సెల్: 98491 45267

Before The Honourable Judge Prinicipal Family Court Vijayawada

F.C.O.P.No. 454/2024

Maintenance Case

Between:
Pamidi Jyotsna @ Nambari Jyotsna **...Petitioner**
And
Pamidi Hema Naga Ravi Kumar **...Respondent**

To:
The Respondent
Pamidi Hema Naga Ravi Kumar
S/o. Srinivasa Rao, 31 Years,
Software Employee, R/o. D.No. 1-85,
Putlacheruvu, Mandavalli Mandal,
Eluru Dt.- 521326.

పై నెంబరు పిటిషన్ లోని రెస్పాండెంటుకు శ్రీ కోర్టువారు సబ్ స్టిట్యూట్ సర్వీసు ద్వారా నోటీసు తీసుకొను నిమిత్తం ఉత్తర్వులు జారీ చేసి యున్నారు. కావున సదరు రెస్పాండెంట్ **ది. 05-05-2025 వ తేది ఉదయం గం. 10-30 ని.లకు** పై చెప్పిన కోర్టులో స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై ఆక్షేపణలు వున్న యెడల తెలుపుకొనవలెను. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడునని శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో తెలియపరచడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వులు ప్రకారం)

Sri. M. Samba Siva Rao
Smt. M.V.L. Gopi Ratnam
Sri. M. Koti Nagaiah
Smt. P. Sai Sree
Vijayawada Advocates,
Dt. 21-03-2025 D.No. 27-30-7, Akulavari Steet,
Governorpet, Vijayawada- 2
Cell: 99480 92920